క్లుప్తంగా

సేంద్రియ వ్యవసాయ రైతులకు చేయూత

పిట్టలవానిపాలెం: సుస్థిర సేంద్రియ వ్యవసాయం అవలంభిస్తున్న ఎస్సీ రైతులకు ఎస్సీ కార్పొరేషన్ చేయూతనందిస్తుందని అల్లూరు యూనిట్ ఎల్.టి సుధ తెలిపారు. మండలంలోని అల్లూరులో సుస్థిర సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తున్న ఎస్సీ రైతులకు ప్లాస్టిక్ డ్రమ్ములు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ రైతులకు సుస్థిర సేంద్రి వ్యవసాయంపై ఆసక్తిని కలిగించేందుకు ఎస్సీ కార్పొరేషన్ ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు కషాయాలు తయారు చేసుకునేందుకు ప్లాస్టిక్ డ్రమ్ములు అందజేసినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 80 మందికి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంతెనవారిపాలెం ఎల్.టి సౌజన్య, అల్లూరు వీఏఏ దీప్తి, వీఆర్ఓ అలపర్తి వెంకటసుబ్బారావు, రైతులు ఉన్నారు.

అల్లూరులో 396 కౌలు కార్డులు మంజూరు

పిట్టలవానిపాలెం : మండలంలోని అల్లూరు రైతు సేవా కేంద్రం పరిధిలో 396 మంది కౌలుదారులకు కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేసినట్లు గ్రామ వీఆర్ఓ అలపర్తి వెంకటసుబ్బారావు తెలిపారు. అల్లూరు రైతు సేవా కేంద్రంలో కౌలు రైతుదారులకు సాగు హక్కు పత్రాలను నమోదు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది 376 మందికి కౌలుదారులకు కౌలు హక్కు పత్రాలు అందించామని, ఈ ఏడాది ఇప్పటి వరకు 396 మందికి మంజూరు చేయడం జరిగిందన్నారు. అర్హత కలిగిన కౌలుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పొలం యజమాని పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జెరాక్సుతో పాటు కౌలుదారునికి ఆధార్ జెరాక్సు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ దీప్తి ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఈవూరి పరామర్శ



నగరం: ట్రాక్టర్ బోల్తా ఘటనలో మృతి చెందిన, గాయపడిన వారి కుటుంబ సభ్యులను రేపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ మండలంలోని గట్టువారిపాలెం గ్రామంలో బుధవారం పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి అండగా నిలుస్తానని భరోసానిచ్చారు. అనంతరం మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కేసన వెంకట్రామయ్య, చిట్టిబాబు, పెద్దబ్బాయి, బెల్లంకొండ పోలేరు వెంకట్రామయ్య, పిచ్చయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

చర్చా వేదికకు అనుమతి ఇవ్వాలి

భట్టిప్రోలు: వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్చార్జ్ వరికూటి అశోక్‌బాబు తనపై చేసిన ఆరోపణల నేపథ్యంలో ఈ నెల 3న భట్టిప్రోలులో ఏర్పాటు చేయనున్న చర్చా వేదికకు అనుమతి మంజూరు చేయాలని కోరుతూ ఎస్ఐ కాసుల శ్రీనివాసరావుకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా బుధవారం వినతి అందజేశారు. తన ఆధ్వర్యంలో కోడి పందేలు, పేకాట, ఇసుక దందా నిర్వహిస్తూ అవినీతికి పాల్పడుతున్నట్లు అశోక్‌బాబు ఆరోపణ చేయగా అవినీతిని నిరూపించమని అశోక్ బాబును కోరడం జరిగిందన్నారు.

ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్ల అడ్డగింత

కొల్లూరు : కూటమి ప్రభుత్వ అక్రమాలు శృతిమించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే స్థాయికి చేరాయి. నదిలో ఇసుకను అక్రమంగా తోడి తరలించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు ప్రజల ప్రాణాలను తోడేసేందుకు సైతం వెనకాడడం లేదు. బుధవారం రాత్రి మండలంలోని గాజుల్లంక, పెసర్లంక కృష్ణా నది నుంచి ఇసుకను ట్రాక్టర్లలో అక్రమంగా తరలిసున్న క్రమంలో మండల పరిధిలోని రావికంపాడులో టీడీపీ వర్గీయులు ట్రాక్టర్లను అడ్డుకున్నారు. కొన్ని రోజులుగా పంచాయతీ మార్గంలో అర్ధరాత్రి సమయంలో 30 పైగా ట్రాక్టర్లు మితి మీరిన వేగంతో వెళుతూ నిద్రపోయే పరిస్థితి సైతం లేకపోవడంతో ఆప్రాంత వాసులు తీవ్ర అసహనానికి లోనవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఓ గృహం ముందు ఫంక్షన్ కోసం టెంట్ ఏర్పాటు చేసి, అందులో ప్రజలు కూర్చుని ఉన్నప్పటికీ అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లు టెంట్ల కర్రలను తొలగించి మరి దౌర్జన్యంగా వెళ్లేందుకు ప్రయత్నించారు. టెంట్‌లను తొలగించి వెళుతుండటాన్ని గమనించిన మహిళలు ట్రాక్టర్ ఎదురుకు వచ్చి నిలువరించేందుకు ప్రయత్నించినా ఆపకుండా వెళ్లడంతో ఆప్రాంతంలోని వ్యక్తులు అందరూ కలసి రెండు ట్రాక్టర్లను నిలిపి వేచి రోడ్డుపైన ఆందోళన చేపట్టారు. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ రవీంద్రారెడ్డి ఆప్రాంతానికి చేరుకొని రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించగా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పంట రక్షకులు.. రైతు నేస్తాలు

- సస్యరక్షణలో పక్షుల పాత్ర కీలకం
- విషతుల్యం కాని ఆహార ఉత్పత్తులకు బాసట
- మండల వ్యవసాయాధికారి సత్యానంద్



సత్యానంద్(ఏఓ)

పిట్టలవానిపాలెం: పంటల సాగులో ఇబ్బడి ముబ్బడిగా వాడుతున్న రసాయన ఎరువులు, క్రిమి సంహారకాల వల్ల తెలియకుండానే అనేక దుష్ఫలితాలు ఎదురవుతున్నాయి. వీటిని వాడడంతో నేలలోని మిత్ర పురుగులు, విషపూరితమైన ఉత్పత్తులను తింటున్న పక్షులు చనిపోతున్నాయి. దీంతో చీడ పీడలు ఉధ్రుతమవడంతో పాటు సాగు ఖర్చులు భారీగా పెరుగుతున్నాయి. పక్షి జాతులు అంతరించడం జీవ వైవిద్యానికినికి చేటు కలిగించే అంశం. వ్యవసాయంలో పక్షులు చేసే మేలుపై మండల వ్యవసాయాధికారి చిర్రావుల సత్యానంద్ అందించిన సూచనలు ఈ విధంగా ఉన్నాయి.

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార అవసరాలు అధికమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆహారోత్పత్తులను పెంచేందుకు రైతులు ఇబ్బడిముబ్బడిగా రసాయన ఎరువులు, పురుగు మందులు వాడుతున్నారు. ఫలితంగా ధాన్యం, కూరగాయలు విషతుల్యమవుతున్నాయి. దీని వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు పలు సర్వేలు చెబుతున్నాయి. అంతేకాదు ఇలాంటి ఆహారాన్ని తింటున్న అనేక రకాల పక్షి జాతులు కూడా ఇప్పటికే అంతరించిపోయాయి. క్రిమి సంహారక మందులకు అలవాటు పడుతున్న క్రిములు, తెగుళ్లు మరింత ధ్రుఢంగా మారుతున్నాయి. దీని వల్ల ఇంకా ఎక్కువ శక్తి వంతమైన రసాయన మందులను వాడుతుండడంతో పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు, శత్రు పురుగులను తినే పక్షులు కనుమరుగు అవుతున్నాయి.



పొలంలో పురుగులను తింటున్న కొంగలు



పొలం దున్నుతుండగా పురుగులను తింటున్న పక్షులు

సహజ రక్షకులు ..

ఇలాంటి పరిస్థితుల్లో కూడా కొన్ని రకాల పక్షులు రైతుకు మేలు చేస్తున్నాయి. పొలంలోని పురుగులను వేటాడుతూ సహజ సిద్ధంగా పైర్లకు రక్షణగా నిలుస్తున్నాయి. నియోజకవర్గంలో వరి, వేరుశనగ, పచ్చి మిర్చి, ఇతర కూరగాయల పంటలు సాగులో ఉన్నప్పుడు కొంగలు, కాకులు, గోరింకలు, పావురాలు, పిచ్చుకలు ఇతర పక్షులు...రైతులు అరకదున్నే సమయంలో భూమి లోపల ఉన్న పురుగులను తింటున్నాయి. పక్షుల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు పలు సార్లు పొలంబడితో అవగాహన కల్పించిన సందర్భాలు ఉన్నాయి.

పక్షులను ఎలా ఆకర్షించాలి...?

పైర్ల సంరక్షణలో పక్షుల సేవలను రైతులు సమర్థంగా వినియోగించుకోవాలి. పంట పొలాల్లో పక్షులు వాలడానికి వీలుగా అక్కడక్కడ వై ఆకారంలో గానీ పందిరి ఆకారంలో కర్రలు ఏర్పాటు చేయాలి. అలాగే పొలం గట్ల వెంట చెట్లను పెంచాలి. వేరుశనగ, మినుము, పెసర తదితర పంటలు వేసినప్పుడు పొలం గట్లపై కంది, జొన్న వంటి పైర్లను పెంచాలి. దీని వల్ల పక్షులు ఆ మొక్కలపై వాలి పురుగులను తినేందుకు వీలుంటుంది. అదే సమయంలో తెగుళ్లను నివారించడానికి విచక్షణా రహితంగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడితే పక్షులు చనిపోయే ప్రమాదం ఉంది. పక్షులను కాపాడేందుకు రైతులు తగు జాగ్రతలు పాటించాలి. వ్యవసాయాధికారులను సంప్రదించి జీవరసాయన ఎరువులు... వారి సలహాలను పాటిస్తూ అవసరమైన మేర క్రిమి సంహారక మందులు వాడాలి. దీంతో హాని లేని ఆహార ఉత్పత్తులను పండించవచ్చు.

ఏ కష్టం వచ్చినా అండగా నిలబడతా

- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు
- చింతమోటులో బాధితులకు పరామర్శ



మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

చింతమోటు(భట్టిప్రోలు): నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ ఎవరికి ఏ కష్టం వచ్చినా నిలబడతానని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్చార్జి వరికూటి అశోక్‌బాబు స్పష్టం చేశారు. భట్టిప్రోలు మండలం చింతమోటు గౌడ కాలనీలో తరతరాలుగా పోరంబోకు భూముల్లో నివాసాలు, పశువుల చావిడులు ఏర్పాటు చేసుకుని ఉంటున్న వారిని కల్యాణ మండపం ఏర్పాటు చేయాలనే సాకుతో జూలై 23న టీడీపీ నాయకుల ప్రోద్బలంతో పంచాయతీ, పోలీసు అధికారుల సమక్షంలో పొక్లెయినర్‌తో తొలగించారు. బుధవారం బాధితులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ సీపీ వారిని టార్గెట్ చేస్తూ, ఎంతటికైనా బరి తెగిస్తున్నారని అన్నారు. పంచాయతీ అధికారులు కొందరికి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కూలదోయడం సరైన పద్ధతి కాదన్నారు. ఎవరికైనా.. అన్యాయం జరిగితే న్యాయ పోరాటం ద్వారా సాధిస్తామన్నారు. పార్టీ కోసం పని చేసిన వారు అధైర్య పడొద్దని, అండగా ఉంటానని, కలసికట్టుగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడదా పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు ఉన్నారు.

తల్లి మందలింపుతో.. యువకుడి ఆత్మహత్య



తిరుపతి పృథ్వి (ఫైల్)

కొల్లూరు : తల్లి మందలింపుతో మనస్థాపానికి గురైన ఓ యువకుడు ఉసురు తీసుకున్న ఘటన మండలంలోని అనంతవరంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి పృథ్వి (23) చిన్న తనంలోనే తండ్రి చనిపోవడంతో రేపల్లె మండలం రావి అనంతవరంలోని తన అమ్మమ్మ దగ్గర ఉంటూ.. కూలి పనులకు వెళ్తూ.. జీవిస్తున్నాడు. ఏడాది క్రితం అనంతవరంలోని తన తల్లి సునీత దగ్గరకే వచ్చి ఉంటూ తన తమ్ముడితో కలసి కూలి పనులకు వెళ్తున్నాడు. కుటుంబ పోషణలో పాలుపంచుకుంటూ గడుపుతున్నాడు. అయితే గత కొన్ని రోజులుగా అతడు ఏ పనికి వెళ్లకుండా తిరుగుతున్నాడు. దీంతో తల్లి సునీత ఓ పక్క తమ్ముడు పనికెళ్తుంటే.. పనికెళ్లకపోవడం ఏంటని మందలించడంతో మనస్థాపానికి గురయ్యాడు. మంగళవారం సాయంత్రం క్రిమి సంహారక మందు తాగి ఇంటికి వచ్చిన పృథ్వి ఉన్న పళంగా పడిపోయాడు. నోటి వెంబడి నురగలు వస్తుండటంతో కుటుంబ సభ్యులు తెనాలి జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ రాత్రి మరణించాడు. తల్లి సునీత ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ అర్జున్ బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

జూదం నిర్వహిస్తే పీడీ యాక్ట్

వేమూరు సీఐ రామకృష్ణ

సాక్షి ఎఫెక్ట్..



మాట్లాడుతున్న వేమూరు సీఐ, కొల్లూరు, భట్టిప్రోలు ఎస్ఐలు

కొల్లూరు : పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయడం జరుగుతుందని వేమూరు సీఐ పి. రామకృష్ణ హెచ్చరించారు. బుధవారం 'సాక్షి' పత్రికలో 'పేకాట'లో ఇదిగో నీ వాటా!' శీర్షికన వెలువడిన కథనం జిల్లా వ్యాప్తంగా చర్చానియాంశంగా మారింది. ఈ నేపథ్యంలో కొల్లూరు పోలీసు స్టేషన్‌లో వేమూరు సీఐ రామకృష్ణ, కొల్లూరు, భట్టిప్రోలు ఎస్ఐలు రవీంద్రరెడ్డి, కె. శ్రీనివాసరావు తో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేకాట శిబిరాల నిర్వాహకులు, కోడి పందేల బరి నిర్వహణదారులు, కోడి కత్తులు కట్టే వ్యక్తులపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. వేమూరు సర్కిల్ పరిధిలోని కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు పోలీసు స్టేషన్ల పరిధిలో పేకాట, కోడి పందేలు జరగకుండా నిరంతర నిఘా ఏర్పాటు చేసి అడ్డుకుంటామన్నారు. జూద క్రీడలు నిర్వహిస్తున్న పక్షంలో తమకు సమాచారం అందిస్తే.. వెంటనే దాడులు చేసి, కేసులు నమోదు చేయడంతో పాటు, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

బాపట్ల తహసీల్దారుగా కృష్ణకాంత్

బాపట్ల: బాపట్ల తహసీల్దార్‌గా కృష్ణకాంత్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ ఎన్నికల సందర్భంగా బదిలీపై వెళ్లిన ఆయన తిరిగి సొంత జిల్లాకు బదిలీపై వచ్చారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

నేడు పింఛన్ల పంపిణీ

వేమూరు: మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని ఎంపీడీఓ శేషగిరిరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమర్తలూరు మండలంలోని కూచిపూడి, వేమూరు మండలంలోని పెరవలిపాలెం గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

భట్టిప్రోలు తహసీల్దార్‌గా శ్రీనివాసరావు



తహసీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

భట్టిప్రోలు: మండల తహసీల్దార్‌గా ఇప్పటి వరకు డెప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఎం. శ్రీనివాసరావు బుధవారం జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశానుసారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తూ శ్రీనివాసరావు ఇక్కడకు వచ్చారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బాధ్యతలు నిర్వహించిన ఐ.మునిలక్ష్మి నెల్లూరుకు వెళ్లారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా శ్రీనివాసరావు వ్యవహరిస్తూ వచ్చారు.

వేమూరు తహసీల్దారుగా సుశీల బాధ్యతల స్వీకరణ



వేమూరు: వేమూరు తహసీల్దారుగా సుశీల బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దారుగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన జె.కిరణ్ బదిలీపై ప్రకాశం జిల్లాకు వెళ్లారు. సుశీల అద్దంకి నియోజకవర్గం కొరిటపాడు మండల తహసీల్దారుగా పనిచేస్తూ.. బదిలీపై వచ్చారు. కార్యాలయం సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

చుండూరు తహసీల్దారుగా మల్లికార్జునరావు..

చుండూరు(వేమూరు): చుండూరు మండల తహసీల్దారుగా మల్లికార్జునరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా కలెక్టరేట్ నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన విశ్వనాథ్‌ను ప్రకాశం కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. మల్లికార్జునరావును కార్యాలయ సిబ్బంది సన్మానించి, అభినందించారు.

రేపల్లె తహసీల్దారుగా శ్రీనివాసరావు బాధ్యతలు



రేపల్లె రూరల్ : రేపల్లె తహసీల్దార్‌గా ఎం.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నగరం మండల డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తూ పదోన్నతిపై రేపల్లెకు ఫుల్ అడిషనల్ చార్జ్ (ఎఫ్ఏసీ) తహసీల్దార్‌గా విచ్చేశారు. ఎన్నికల బదిలీలలో భాగంగా ఇప్పటి వరకు రేపల్లెలో విధులు నిర్వర్తించిన చొప్పా రవీంద్ర నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు.. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావుకు కార్యాలయ సిబ్బంది వీఆర్వోలు, పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అమర్తలూరు తహసీల్దారుగా నెహ్రూబాబు..

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు తహసీల్దారుగా నెహ్రూబాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దారుగా పని చేసిన కవిత కలెక్టరేట్‌లో సెక్షన్ అధికారి వెళ్లారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి తహసీల్దారుగా పని చేస్తున్న నెహ్రూబాబు బదిలీపై వచ్చారు. కార్యాలయం సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

ఆవుల లోడుతో ఉన్న లారీ స్వాధీనం

గుంటూరు రూరల్ : అక్రమంగా ఆవులు, ఎద్దులను తరలిస్తున్న లారీని నల్లపాడు పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం ఎన్‌హెచ్-16 అంకిరెడ్డిపాలెం సమీపంలో ఆవులను అక్రమంగా లారీలో తరలిస్తున్నారని ఎస్పీ కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆవులను స్వాధీనం చేసుకున్నామన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన



అమర్తలూరు(వేమూరు): ద్విచక్ర వాహనదారులందరూ తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సీనియర్ న్యాయవ్యాది గుమ్మడి రవిరాజా తెలిపారు. అమర్తలూరు మండల కేంద్రంలో హెల్మెట్ వినియోగంపై బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు పీఎల్‌వీ బొర్రు రవీంద్ర మాట్లాడుతూ తెనాలి కోర్టు ఆదేశాలు మేరకు హెల్మెట్‌పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఎస్కే షరీఫ్, కేఎస్ రెడ్డి, వి సుధారాణి, హెడ్ కానిస్టేబుల్ ఉమెన్ కుమారి సింధూ, చాముండేశ్వరి, సమాచారం హక్కు మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



రేపల్లె రూరల్: పట్టణాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి, మాట్లాడారు. పట్టణంలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించడం జరిగిందన్నారు. ప్రస్తుత వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని వార్డుల్లో పారిశుద్ధ్య పరిరక్షణకు నిరంతరం శ్రద్ధ వహిస్తున్నామన్నారు. ఇళ్లలో వచ్చే చెత్తను నిర్ణీత ప్రదేశాలలో ఏర్పాటు చేసిన చెత్త కుండీల్లో పడవేయాలని, లేనిపక్షంలో పారిశుద్ధ్య సిబ్బందికి తడి చెత్త-పొడి చెత్త రూపంలో అందించాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో కుక్కల బెడదను తొలగించాలని, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు తొలగింపునకు యజమానులకు నోటీసులు జారీ చేయాలని, 3, 5 వార్డుల్లో అవసరమైన చోట్ల డ్రెయిన్‌లు, రహదారులు నిర్మించాలని ఆయా వార్డుల కౌన్సిలర్‌లు సమావేశంలో ప్రస్తావించారు. అనంతరం ఏజెండాలోని 36 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, కమిషనర్ శేషాద్రి, కౌన్సిలర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి

భట్టిప్రోలు: ప్రతి ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ తప్పనిసరి అని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి అన్నారు. ఎంపీడీవోగా పని చేస్తున్న జేబీవీ మల్లికార్జునరావు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆమె మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇక్కడకు వచ్చిన మల్లికార్జునరావు భట్టిప్రోలులోనే ఉద్యోగ విరమణ చేయడం విశేషమన్నారు. మల్లికార్జునరావు దంపతులను అధికారులు, ప్రజా ప్రతినిధులు, బంధు మిత్రులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, మండల ప్రత్యేక అధికారి, బాపట్ల జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి ఎం.హనుమంతరావు, చెరుకుపల్లి, వేమూరు, కొల్లూరు, రేపల్లె, ఎంపీడీవోలు శ్రీనివాసమూర్తి, శేషగిరిరావు, లక్ష్మీకుమారి, శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ సీహెచ్ జలజ, ఈవోపీఆర్డీ టి. ఊహారాణి, ఎంఈవో నీలం దేవరాజు, పీఆర్ ఏఈ శేతు రామచంద్రరరావు, కో-ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, దున్నా తిరుపతిబాబు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మొక్క నాటుతున్న డీఎస్పీ మురళీకృష్ణ

రేపల్లె రూరల్: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని రేపల్లె డీఎస్పీ తక్కెళ్లపాటి మురళీకృష్ణ కోరారు. వెస్లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. చెట్లు నరికివేయటంతో వాతావరణంలో కార్బన్ డైయాక్సైడ్ పెరిగి ఓజోన్ పొర దెబ్బ తింటుందన్నారు. మొక్కలు పెంపకంతోనే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. చిన్న వయస్సు నుంచి ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచటాన్ని అలవాటు చేసుకోవాలని చెప్పారు. మొక్కను నాటితే ఆ మొక్క మనల్ని రక్షిస్తుందన్న నినాదంతో వెస్లీ ఫౌండేషన్ మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వెస్లీ చైర్మన్ జాన్‌వెస్లీ, ఫౌండేషన్ సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనది



ఉపాధ్యాయుడు శేషవర్మరాజును సన్మానించిన ఎంఈవోలు

కర్లపాలెం: విద్యార్థలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దగల ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని ఎంఈవో-1 టీవీ మనోరంజని, ఎంఈవో-2 విజయశ్రీ తెలిపారు. పేరలి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ చేసిన వి.శేషవర్మరాజును ఎంఈవోలు, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మనోరంజని, విజయశ్రీలు మాట్లాడుతూ శేషవర్మరాజు విధి నిర్వహణలో క్రమ శిక్షణతో మెలగటంతో పాటు విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన అందించారని చెప్పారు. విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం కూడా నేర్పగలిగే అవకాశం ఉపాధ్యాయులకే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యూటీఎఫ్, ఎస్టీయూ సంఘాల నాయకులు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలుకల మందు తిని వ్యక్తి మృతి

చావలి(వేమూరు): ఎలుకల మందు తిని పెరికల మల్లేశ్వరరావు (51) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని చావలి దళితవాడకు చెందిన పెరికల పద్మారావు మద్యానికి బానిస అయ్యాడు. మంగళవారం ఉదయం మద్యం సేవించించి ఇంటికి వెళ్లాడు. భార్య పిల్లలు రోజూ మద్యం తాగితే ఎలాగా అంటూ మదలించారు. దీంతో పొలంలోకి వెళ్లి మల్లేశ్వరరావు ఎలుక మందు మద్యంలో కలుపుకొని తాగాడు. గ్రామస్తులు చూసి అతని భార్యకు చెప్పారు. 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యా శాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఇన్‌చార్జీ ఎస్ఐ రవీంద్ర రెడ్డి బుధవారం తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఏఈ కుమార్ సేవలు ఎనలేనివి

కర్లపాలెం: ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించటంలో ఏఈ మల్లెల కుమార్ సేవలు ఎనలేనివని ఈఈ ఆంజనేయులు పేర్కొన్నారు. కర్లపాలెం విద్యుత్ ఏఈగా పనిచేసిన మల్లెల కుమార్ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగులు ఏఈ కుమార్‌కు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఈఈ ఆంజనేయులు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనేది సాధారణమైన విషయమని.. సర్వీసులో ఉన్నప్పుడు మంచిగా సేవలందించే అధికారులను ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారని చెప్పారు. డీఈ హరిప్రసాద్‌రావు మాట్లాడుతూ మల్లెల కుమార్ సిబ్బంది కలసిమెలసి ఉంటూ ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈలు విజయ్‌శ్రీనివాస్, పెరుగు శ్రీనివాసరావు, వై.కోటేశ్వరరావు, దుర్గా ప్రసాద్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఏఈ కుమార్‌ను సన్మానించిన ఈఈ, డీఈలు